ఆ పలకను క్రిందకు తొయ్యబోతే అప్పటికప్పుడే పెద్దవాని బుజా నెక్కి కూర్చున్న చిన్నవాడు "పలక పగిలిందా, ఖరీదు నాలుగు రూపాయలు!" అని బండివాణ్ణి బెదరించాడు. బెదరిస్తూ ఛల్ ఛల్ అన్నాడు. పెద్దవాడు చిన్నవాణ్ణి బండిమీద కూలేస్తూ "ఒరేవ్! బండబ్బీ! వాణ్ణి పడగొట్టావా వాడి పలకేకాకుండా తలకూడా పగిలేని, వాడి తల ఖరీదు పధ్నాలుగు రూపాయలు" అంటూ తాను "జయ పరమేశ్వరా!" అని గడుకొయ్య ఎగిరి ఎగిరి పట్టుకొని పైకెగబాకి తోడివాణ్ణి కలుసుకొని నవ్వసాగాడు.

"నా పలక పగలలేదురోయ్! చూడు" అన్నాడు చిన్నవాడు. "పలకెప్పుడూ పగలదు పగిల్తే తలే పగలాలి" అన్నాడు. "నీదా నాదా?" అన్నాడు చిన్నవాడు. మనం బ్రద్దలగొట్టగలిగితే బండబ్బి తల! బండబ్బి బ్రద్దలుకొడితే మన తలలు!" అన్నాడు పెద్దవాడు" దాంతో చిన్నవాడు గంతులేస్తూ మేం పగలగొట్టక మంటూవస్తే బండబ్బీ! నీ ఒక్కడి తలే! నీవు పగలగొట్టమంటూవస్తే మా రెండు తలలూ పగలగొట్టాలి" అన్నాడు. బండి బోల్తాకొడితే మూడూ పగలగలవు! అంది నీళ్లుమోసే నీరజాక్షి. "అప్పుడు కుండ పగుల్తుంది" అంటూ బండి, నామె నీళ్ళకుండ అనుకుంటుంటే ధబాలున తోలాడు, అదేపరుగున ఆ ఎడ్లూ బండీ!

పాట

నీరజాక్షి బోరగిలబడి వారితోడ తడిసిపోయే!
బాండము మరి బ్రద్దలాయె! బడా ఆద్మీ ప్రియుడుపోయే!
రోడ్డంత 'లారీ' కూసె; వెరీ సారీ! అరే క్యారే హడావిడ్ బజారే!

... ... ... ... ...

## తలక్రిందులు ప్రపంచము

పొలాలమ్మట పోతూవుంటానా,
"ఈ పొలం తమదా? అండీ"
అని "ఇలా ఎందుకు వచ్చేరు?" అని ఇలాటి ప్రశ్నలు వీళ్ళూ వాళ్ళూ వేస్తారు. "ఊరికేనే!" "ఊరికేనే!" అని ఎన్నిమార్లు

జవాబు చెప్పేనో; అప్పొద్దు అలాంటి బాధపడలేక పట్నంలో నడుపీధినివున్న పెద్దతపాలాఫీసువీధి మెట్లమీద కూర్చున్నాను. "ఎవరూ నన్ను పలుకరించరుగదా" అని. ఎంచేతా అంటే పోస్టాఫీసు అంటే సర్కారువారిదనీ. అక్కడకు వచ్చేవాళ్ళంతా ఎక్కణ్ణుంచో ఎవళ్లో వ్రాసిపంపిన ఉత్తరాలు, మనియార్డర్లు, వీపీలు దేఖీలు పుచ్చుకోడానికి రావడము, ఇచ్చుకోడానికి రావడము జరుగుతుంది. కాని నా బోంట్లతో అప్రస్తుతంగా మాట్లాడి నా కాలం వృథాపుచ్చడం, వాళ్ళకాలం వృథాపుచ్చుకోవడం కాదనీ ఊహించేను.

అంచేత మూసినగొడుగు నాంచుకు కూర్చున్నాను ఒక మెట్టుమీద. ఎదర పిట్టగోడవుంది, రోడ్డుకు మెట్లకుమధ్య నావెనకతట్టు వరాండా, వరాండాగోడ, గోడకు ఉత్తరాలుపడేసే రంధ్రాలు, ఉత్తరాలుతీసే కాలపట్టికలు అవీ తెలిపే వ్రాతబల్లలు ఏవేవో వున్నాయి. కొన్ని కాగితాలు అంటింపుచే ఎగిరేవి, కొన్ని జిగురు అంటుకోనివి, కొన్ని ప్రజకర్ధమయ్యేవి కొన్ని కానివి.

ఎలాగో చేరేరు అయిదారుగురు తీరికరాయిళ్లు, తపాలా బంట్రోతులు అకాడకు అకాలానికి! 'కాకి' నిక్కర్లు 'కాకి' చొక్కాలు వేసుకుని తలపాగాలు లేకుండా అదో దిరాసగాను దిరాసకాకుండాను. ఒకళ్ళిద్దరు పిట్టగోడమీద కూర్చున్నారు. మరో నలుగురు పిట్టగోడ మెట్లమీద కూర్చున్నారు. ఆ మెట్లు చాలా చాలా పొడుగుపాటివి. ఎంతమందికైనా 'గాలరీ'లా పనిచేస్తాయి.

ఒక బంట్రోతు కబుర్లు చెబుతూంటే, తక్కినవాళ్ళు వింటూవున్నారు. వినోదంగా నవ్వుతూవున్నారు. ఎటకారంగా ఎదరుప్రశ్న లడుగుతూవున్నారు. సర్వం సరదాగాను, సంబరంగాను వుందనుకోండి! "ఎవడో ముప్పైరెండు సైకిళ్లు దొంగిలించాడు, పట్టుపట్టాడు కాని పారిపోయాడు" అదోవార్త వాడు

చెప్పింది. ఆవార్త వినివిని అడిగేడు మరొకడు—"ముప్పైరెండు సైకిళ్ళమీద ఒక్కసారిగా ఎక్కి పారిపోయాడా? ముప్ఫైయొక్క సైకిలక్కడొదిలేసి వొక్కదానిమీదే పారిపోయాడా?" అని ఈ "చీకట్లో ఎవడు చూశాడు?" అని ఈ మూడోవాని జవాబు.

ఆ యింతలో ఒక సైకిలు గణగణామంది. "అడుగో! అమ్మీ! వచ్చేడు మీ బీటోడు! వాణ్ని కనుక్కో నీకు మని ఆర్డరు వచ్చిందీ రానిదీ" అని ఒకమ్మకి ఊసుచెప్పేడు కబుర్లరాయడు. అందరిదృష్టి ఆదాకా ఆ అమ్మిని పరకాయించంది ఆ ఊసుతో ఆ అమ్మకేసి మళ్లింది. ఆమె చంకనో బిడ్డవుంది. ఆ బిడ్డతో ఆమె ఆ బీటుప్యూన్ వంకకు నడిచింది.

నేను "ఏమా?" అని చూస్తూవున్నాను...అంతలోకే ఒక కోయ యువకుడు కోతివాలంలా గోచిపెట్టుకుని నాగరీకునిలా బనియనుమీద కోటు తొడుక్కొని బీదవానిలా గుడ్డలో చిరుగులు రూపులో మాపు కనబరచుకొంటూ "అమెకు మనియార్డరు లేకపోతే నాకుందేమో అడుగుండి" అని అన్నాడు.

"నీవొకటి రాసి డబ్బు పంపుకుంటే అప్పుడందుతుండి!" అన్నాడు ఆ బీటు బంట్రోతు. "రాయడానికి సిరా?" అన్నాడు కోయవాడు. కబుర్లరాయుడు 'రాసి' తల్లక్రిందులుచేయి సిరా 'అవుద్ది' అంటూ లేచిపోయాడు.

'రాసి' తల్లక్రిందులుచేస్తే నాపాట్టో? " అని అనుకొనేడు కోయవాడు" అవితే రాసిందే తల్లక్రిందులుచేసి పంపేశాడు లాగుంది ఈ బంట్రోతన్న" అని అనుకో మొదలెట్టింది ఆ మాతృ స్వరూపిణి.

నేను వాళ్లిద్దరి రాసులు మీనరాశా? మేషరాశా? కర్కాటక రాశా? వృశ్చికరాశా? అని అలా అలా పండ్రెండు రాశులను గురించి యోచింపసాగాను తల్లక్రిందులుగా.

వెంటనే ఆకాశమంతావచ్చి నా కళ్లముందు పడ్డట్టయింది. శకున పక్షు లెగిరిపోయాయి. సాముద్రిక రేఖలు చెరిగిపోయినాయి. పంచాంగాలు చిరిగిపోయినాయి. పండ్రెండురాశుల్ని పండ్రెండు గురు సూర్యులు ఆవరించినంత వెలుగు వెలిగిపోయింది. వెలుగు పడుతున్నకొద్దీప్రపంచమంతా తల్లక్రిందలై యూరుకుంది.

... ... ... ... ...

## అది 'వర్టికల్ చావా ?' - 'హారిజాంటల్ చావా ?'

నాకు ఉదయం ఆరు ఆరున్నర కాకుండా కాఫీ త్రాగడం అలవాటు. యీ అలవాటు ఒక ముప్ఫై యేళ్ళనుంచి పరిపాటిగావున్న కారణంచేత ఎక్కడికివెళ్ళినా ముందు ఆ ప్రయత్నంమీదనే ఇంట్లోవాళ్ళంతా నా విషయమై ఉండేటట్లు చూస్తాను. అంచేతను ఆ ఉదయంకూడా నేను వెళ్లింది పొరుగూరు అయినా బసచేసింది కావలసినవాళ్ళ యిల్లవడంచేత ఏలోపం లేకుండా, నాకు రాకుండా నా బంధువర్గం ప్రవర్తించారు.

వారి చావడిలో ఒక టేబిల్‌వుంది. ఈదయం 6¾కే టేబిల్ మీద కాఫీపెట్టారు. టేబిల్‌ముందు ఒక కుర్చీ వేశారు. కుర్చీమీద నేను కూర్చున్నాను. నేనొక్కణ్ణేనా? ఇక్కడ కూర్చునేది? ఇది పుచ్చుకునేది? అని అంటే నీవొక్కడవే! మేమంతా కొందరం పుచ్చుకొనే పుచ్చుకోం, కొందరం బాగా ఎండెక్కి స్నానం చేశాకో, జపం చేశాకో తీసుకుంటాం" అని వారంతా అన్నారు. ఇంటియజమాని ఆరోగ్యంకోసం త్రాగుతున్నాను అని అలా ఎత్తి ఇంచుకంత కాఫీ చవిచూచాను.

చవిచూచానో లేదో చటక్కున వీథితలుపుతోసిన చప్పుడైంది. తెరువబడింది. వీథి అంతా వెల్లడయింది. అంతగా మార్గం మీద వుంది నే బసచేసిన ఆ యిల్లు.